క్లుప్తంగా

ఎం. కోడూరు షిర్డిసాయి ఆలయానికి విరాళం



ఆలయం నిర్మాణానికి విరాళం అందజేస్తున్న రాపర్తి సూర్యనారాయణ

మాడుగుల రూరల్: ఎం.కోడూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న షిర్డిసాయినాథుని ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన రాపర్తి సూర్యనారాయణ, సత్యవతి దంపతులు రూ 25,000 నగదును గురువారం అందజేశారు. ఈ విరాళం స్థానిక ఆలయ కమిటీ నిర్వాహకులు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడుకు అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు జొన్నపల్లి నాగరాజు, వంజువంజుల నాగరాజుతో పాటు శీరా తలుపులు నాయుడు, శివమాలాధారణ భక్తులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యకు చెక్



తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

గొలుగొండ: ఏఎల్‌పురంలోని ఎస్సీ కాలనీ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని సర్పంచ్ లోచల సుజాత తెలిపారు. పంచాయతీ నిధులతో బెల్ వెల్ నుంచి 2వేల లీటర్లు సామర్థ్యం కలిగిన ట్యాంక్ ద్వారా తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ గజ్జలపు మణికుమారి మాట్లాడుతూ లింగంపేట భారీ స్కీమ్ ద్వారా నీరు సక్రమంగా అందక ఇక్కడి ప్రజలు తాగునీటి సమస్యతో బాధపడేవారని, వారికి పంచాయతీ నుంచి పూర్తి స్థాయిలో తాగునీరు అందించడం చాలా ఆనందంగా ఉందని సర్పంచ్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమలో వార్డు మెంబర్లు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

కె.కోటపాడు : కె.కోటపాడు సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ పనులను శుక్రవారం నిర్వహిస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏఈ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. ఈ కారణంగా సబ్ స్టేషన్ పరిధిలో గల గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ ఉండని కారణాన్ని వినియోగదారులు గుర్తించి సహకరించాలని ఏఈ చంద్రశేఖర్ కోరారు.

తూటిపాలలో సీవీ రామన్ జయంతి



రామన్ వేషధారణలో బాలసుబ్రమణ్యం, ఇతర విద్యార్థులు

మాకవరపాలెం : నోబెల్ అవార్డు గ్రహీత సి.వి. రామన్ జయంతిని మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం ఉపాధ్యాయులు, విద్యార్థులు సి.వి.రామన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న బాలసుబ్రమణ్యం రామన్ వేషధారణలో అలరించాడు. విద్యార్థులకు ఉపాధ్యాయులు సి.వి.రామణ జీవిత చరిత్రను ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాము, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు బజార్ కార్డుల పంపిణీ

కె.కోటపాడు : రైతు బజార్‌ల ద్వారా రైతులు పండించిన కూరగాయల ధరలకు మంచి మద్దతు ధర దక్కుతుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో 16 గ్రామాలకు చెందిన 135 మంది రైతులకు మంజూరైన రైతు బజార్ కార్డులను గురువారం ఆయన పంపిణీ చేశారు. మర్రివలస గ్రామంలో మౌలిక వసతులను ప్రాధాన్యతా క్రమంలో కల్పించేందుకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.



కొండ దిగువన కాలువలో ప్రవహిస్తున్న నీరు



తాండవ ప్రాజెక్టు ప్రధాన గట్టు



డ్యామ్ దిగువన నల్లగొండమ్మ ఆలయం

చూపరుల మది ఆనంద తాండవం



రెండు కొండల నడుమ నిర్మించిన తాండవ ప్రాజెక్టు



అమ్మవారి గుడి వద్ద ఆంజనేయస్వామి విగ్రహం

- పిక్నిక్ స్పాట్‌గా తాండవ ప్రాజెక్టు
- ప్రకృతిలో మమేకం...సందర్శకులకు ఆహ్లాదం
- కార్తీకమాసంలో సందడే సందడి

నాతవరం : కార్తీక మాసం ప్రారంభం దగ్గర్నుంచి తాండవ రిజర్వాయరు పిక్నిక్ స్పాట్‌కు నిలయంగా మారుతుంది. అనకాపల్లి, కాకినాడ జిల్లాల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 52 వేల ఎకరాలకు సాగునీరు అందించే తాండవ రిజర్వాయర్ కార్తీక మాసమంతా సందర్శకులతో సందడిగా ఉంటుంది. ప్రకృతి రమణీయతకు అద్దం పట్టేలా తాండవ ప్రాజెక్టు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఒక పక్క కనుచూపు మేర కళకళలాడుతూ ప్రాజెక్టులో నీరు. మరో పక్క పంట పొలాలకు గలగలా కాలువలో ప్రవహించే నీరు. దట్టమైన అటవీప్రాంతాన్ని తలపించేలా ఎత్తయిన కొండల నడమ నిర్మించిన తాండవ ప్రాజెక్టు నిత్యం కిలకిలలాడే పక్షులతో ఎంతో ఆహ్లాదంగా దర్శనమిస్తుంది. పిక్నిక్ ప్రియుల మది దోచుకుంటుంది.

చెంతనే నల్లగొండమ్మ ఆలయం

తాండవ డ్యామ్ దిగువ ప్రాంతంలో ఈ ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం నల్లగొండమ్మ తల్లి ఆలయం, దాని పక్కనే 50 అడుగుల ఎత్తులో ఆంజనేయ స్వామి విగ్రహం నిర్మించారు. ప్రతి ఆదివారం మంగళవారం గురువారం అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఆలయాలు సమీపంలో వందలాది మంది కూర్చొని సంహపంక్తి భోజనాలు చేసేందుకు ప్రత్యేకంగా షెడ్లు నిర్మించారు. చిన్నారులు, పెద్దలు సైతం ఆటపాటలతో గడిపేందుకు సర్వాంగ సుందరంగా అమ్మవారి ఆలయానికి తూర్పు భాగంగా పార్కు ఏర్పాటు చేశారు. ముందుగా తాండవ రిజర్వాయరు వెళ్లే మార్గంలో వినాయకుడి ఆలయం నిర్మించారు.

బోటులో విహారం...

తాండవలో మరో ప్రత్యేకత తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం ప్రమాద స్థాయి సమయంలో నదిలో విడుదల చేసేందుకు రెండు కొండలను చీల్చి స్పిల్‌వే గేట్లు ఏర్పాటు చేశారు. వీటిని చూడడానికి సందర్శకులు ఎంతో ఆసక్తి కనబరుస్తారు. ఇక్కడ మత్స్యకారులు ప్రైవేటు బోట్లలో ఆసక్తి ఉన్న సందర్శకులను తాండవ ప్రాజెక్టులో బోటు షికారు తిప్పుతుంటారు. తాండవ రిజర్వాయరు తూర్పు భాగంలో ఎత్తయిన కొండపై గొలుగొండ మండల కేంద్రానికి వెళ్లడానికి ఘాట్‌రోడ్డు ఏర్పాటు చేశారు.



చూడముచ్చటగా కనిపించే పార్కు ముఖద్వారం

ఈ ఘాట్ రోడ్డు తాండవ ప్రాజెక్టు లోపల నీటిని అనుకుని వేయడంతో ఈ రోడ్డులో ప్రయాణిస్తుంటే ఒక పక్క ఏజెన్సీ ప్రాంతాన్ని తలపించే ఘాట్ రోడ్డు ప్రయాణం, మరోపక్క నదీ తీరంలో షికారు అనుభూతి కలుగుతుంది.

తాండవ చేరుకోవడం ఇలా..

- నర్సీపట్నం నుంచి తాండవ ప్రాజక్టు 28 కిలోమీటర్ల దూరంలో ఉంది.
- నాతవరం మండల కేంద్రానికి కేవలం 8 కిలోమీటర్ల దూరంలో ఉంది.
- ప్రతి రోజు నర్సీపట్నం నుంచి తాండవ బస్సులు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు తిరుగుతుంటాయి.
- నర్సీపట్నం తుని మధ్య రోడ్డులో తాండవ జంక్షన్ నుంచి నాతవరం గ్రామం నుంచి నిత్యం ఆటోలు తిరుగుతుంటాయి. ప్రైవేటు వాహనాలు సైతం అందుబాటులో ఉన్నాయి.

అవినీతిపై వజ్రాయుధం స.హ.చట్టం

దేవరాపల్లి : అవినీతి రహిత సమాజ నిర్మాణానికి సమాచార హక్కు చట్టం వజ్రాయుధం లాంటిదని స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మీ, జెడ్పీటీసీ కర్రి సత్యం అన్నారు. ఈ మేరకు స్థానిక వ్యవసాయ కార్యాలయంలో స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ అధ్యక్షతన సిబ్బంది, రైతులకు సమాచార హక్కు చట్టంపై గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బుల్లిలక్ష్మీ, జెడ్పీటీసీ సత్యం మాట్లాడుతూ పాలనలో పారదర్శకతకు సమాచార హక్కు చట్టం దోహదపడుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ స.హ.చట్టంపై అవగాహన పెంచుకోవాలని వారు సూచించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ సమాచార హక్కు చట్టం ఆవశ్యకతను, దరఖాస్తు చేసే విధానం, కలిగే ప్రయోజనాలను సమగ్రంగా వివరించారు. ఈ అవగాహన సదస్సులో మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్.కిరణ్‌కుమార్, వంటాకు శ్రీను, సబ్బవరపు మాలిబాబు, తమటపు శంభునాయుడు, బీలా ఈశ్వరరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మీ, జెడ్పీటీసీ కర్రి సత్యం

నీటి సంఘాల ఎన్నికలకు సన్నాహాలు

మాడుగుల రూరల్: ఈ నెల 23 వ తేదీన నీటి సంఘాల ఎన్నికలకు చర్యలు తీసుకుంటున్నట్టు జల వనరుల శాఖ ఏఈ డి. భార్గవ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడు తూ 14 చిన్న నీటి సంఘాలు, 8 మీడియం నీటి సంఘాలు ఉన్నాయని, వీటిలో తెన్నేటి విశ్వనాథం జలాశయం పెద్దేరు జలాశయం పరిధిలో 7 సంఘాలు, చీడికాడ మండలం వేచలపు పాలవెల్లి (కోనాం జలాశయం) పరిధిలో ఒక సంఘాన్ని ఈ నెల 23 వ తేదీన ఎన్నికలు జరుగుతాయన్నారు. సభ్యుల జాబితాను సిద్ధం చేస్తున్నామన్నారు. ఛైర్మన్‌ను ఎన్నుకోవడంతో పాటు రైతులు చేతులు ఎత్తడం ద్వారా గాని లేకపోతే ఎన్నిక నిర్వహించవలసి వస్తే, రైతులకు స్లిప్‌లు ఇచ్చి వారు స్వేచ్ఛగా ఛైర్మన్‌ను ఎన్నుకునే అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



నర్సీపట్నం వెలుగు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వీఓఏలు



చీడికాలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న వీఓఏలు



మాడుగులలో నిరసన తెలుపుతున్న వీవోఏలు



బుచ్చెయ్యపేటలో ధర్నాలో పాల్గొన్న వీవోఏలు

బుచ్చెయ్యపేట : వెలుగులో పని చేస్తున్న వీవోఏలు జీతాలు అందించాలని గురువారం ఎంపీడీవో కార్యాయం ముందు ధర్నాకు దిగారు. ఐదు నెలలుగా గౌరవ వేతనం అందించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వీవోఏల మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వంలో కొన్ని గ్రామాల్లో రాజకీయ వేధింపులతో వీవోఏల తొలగింపులను ఆపాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే అందించాలని, మహిళా మార్టులో సరుకులు కొనుగోలుకు బలవంతపు టార్గెట్‌లు ఇచ్చి ఒత్తిడిలు చేసే పద్ధతిని విడనాడాలని నినాదాలు చేశారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీడీవో విజయలక్ష్మి, మండల వెలుగు పథకం ఏపీఎం టి.రాజునాయుడుకు మండల వీవోఏల సంఘ నాయకులు వరలక్ష్మి, గంగాభవానీ, దమయంతి, నూకరత్నం, శాంతి తదితరులు వినతి పత్రం అందించారు.

కె.కోటపాడు : ఎన్నికల సమయంలో వీవోఏలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని సీఐటియూ మండల నాయకుడు ఈర్లి నాయుడుబాబు అన్నారు. వెలుగు కార్యాలయం ఎదుట గురువారం సమస్యల పరిష్కారానికి ధర్నా జరిపారు. ఈ సందర్భంగా నాయుడుబాబు మాట్లాడుతు వీవోఏల మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయడంతో పాటు, ఐదు నెలల వేతన బకాయిలను చెల్లించాలని కోరారు. వీవోఏలపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. ధర్నాలో వీవోఏల మండల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యం, చిన్నమ్మలు, గాయత్రి, భవాని, వెంకటలక్ష్మి, ఎం.నాగభూషణం పాల్గొన్నారు.

చీడికాడ: వీఓఏల సమస్యలు పరిష్కరించాలని మండల సిఐటీయు కార్యదర్శి ఆర్.దేముడునాయుడు అన్నారు. గురువారం వీఓఏల సమస్యలపై నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ మేరకు ఆయన వీవోఏలతో కలిసి తమ డిమాండ్లతో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణకు వినతి పత్రం అందించారు.


మాడుగుల : తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలంటూ గురువారం వీవోఏలు మాడుగులలో సీఐటీయు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం ఎంపీడీవో కొంకి అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. వీవోఏల జీతం బకాయిలు చెల్లించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, మహిళా మార్టులో సరకులు కొనుగోలు లక్ష్యాలు ఇచ్చే పద్ధతి విడనాడాలని వినతి పత్రంలో కోరారు. వీవోఏల జిల్లా ఉపాధ్యక్షుడు సుంకరి శ్రీనువాసరావు, బత్తుల గంగాభవాని, ఇతర సభ్యులు గొల్లేరి జగదేశ్వరి, మద్దిల భవానీ, రావాడ కొండబాబు పాల్గొన్నారు.

నర్సీపట్నం : వెలుగు వీఓఏలుగా పని చేస్తున్న యానిమేటర్లను ప్రతి మూడేళ్లకొకసారి మార్చాలనే సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని, పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని వెలుగు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వీఓఏల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆదిలోనే వీఓఏలపై కత్తి కట్టిందన్నారు. ప్రభుత్వ విధానం వల్ల వీఓఏలు ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగ భద్రత, బీమా వంటి సదుపాయాలు వర్తింపజేయాలన్నారు. ధర్నాలో సిఐటీయు జిల్లా కార్యదర్శి ఎ.రాజు, రాజ్యలక్ష్మి, లలిత, లక్ష్మి పాల్గొన్నారు.

ఇంటి వద్దే క్యాన్సర్ పరీక్షలు

మాకవరపాలెం: అవగాహనతోనే క్యాన్సర్ వ్యాధిని నివారించవచ్చని మాకవరపాలెం, బూరుగుపాలెం వైద్యాధికారులు శ్రీవిద్య, చరిష్మ అన్నారు. జాతీయ క్యాన్సర్ దినోత్సవంలో భాగంగా గురువారం వైద్య సిబ్బందితో కలసి ర్యాలీ చేశారు. గ్రామాల్లో క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దే పరీక్షలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

మాకవరపాలెం : జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా తామరం ఇమ్మానుయేలు నర్సింగ్ కళాశాలలో గురువారం వైద్యాధికారులు శ్రీనివాసరావు, చరిష్మ క్యాన్సర్ లక్షణాలు, వ్యాధి నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.



అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గొలుగొండ: ప్రజలు క్యాన్సర్ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని గొలుగొండ, కృష్ణదేవిపేట పీహెచ్‌సీ సిబ్బంది గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, వైద్య పరీక్షలు గురించి ప్రజలకు వివరించారు.

కె.కోటపాడు : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ క్యాన్సర్ నిర్ధారిత పరీక్షలు చేయించుకోవాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల అన్నారు. పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి గురువారం అవగాహనా ర్యాలీ జరిపారు. ముందస్తు నిర్ధారణ పరీక్షల ద్వారా వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే వ్యాధిని నయం చేసుకోవచ్చన్నారు.

చెత్త వేస్తే ఊరుకునేది లేదు...



సర్పానది వద్ద ట్రాక్టర్లను అడ్డుకున్న కొండలఅగ్రహారం గ్రామస్తులు

మాకవరపాలెం : సర్పానది పరీవాహక ప్రాంతంలో వేస్తున్న చెత్త ట్రాక్టర్లను కొండల అగ్రహారం గ్రామస్తులు అడ్డుకున్నారు. మాకవరపాలెం గ్రామంలో ఊడ్చిన చెత్తను కొండల అగ్రహారం గ్రామ సమీపంలో ఉన్న సర్పానది ప్రాంతంలో వేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం అధ్వానంగా మారిందని స్థానికులు అనేకసార్లు అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం సర్పానది వద్ద చెత్తను వేసేందుకు వచ్చిన నాలుగు ట్రాక్టర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ గ్రామంలో వేసే చెత్తను చెత్త సంపద కేంద్రం వద్దకు తరలిస్తున్నామని, వేరే గ్రామం నుంచి చెత్తను తీసుకువచ్చి ఇక్కడ ఎలా వేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నది పరిసరాలు వ్యర్థాలతో నిండి పోవడంతో నదిలో అడుగు పెట్టలేని పరిస్థితి ఏర్పడిందని మాజీ ఎంపీటీసీ సుర్ల గౌరీశంకర్రావు అన్నారు. ఇకపై ఇక్కడ చెత్తను వేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. చెత్తతో సహా ట్రాక్టర్లను వెనక్కి పంపివేశారు.

సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలి



దేవరాపల్లి ప్రభుత్వ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

దేవరాపల్లి : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.కొండలరావు సూచించారు. ఈ మేరకు దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. స్థానిక ప్రిన్సిపాల్ బి.రాధ సూచనల మేరకు కళాశాల ప్రాంగణంలో విరివిగా మొక్కలు నాటారు. విద్యార్థులంతా మొక్కలు నాటడంతో పాటు నాటిన మొక్కలను బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెమిస్ట్రీ అధ్యాపకులు పి.వసిమల్లా, హిందీ లెక్చరర్ నిర్మలా, లైబ్రరీ, సైన్స్ అధ్యాపకులు ఉమామహేశ్వరీ, ఆంగ్ల అధ్యాపకులు ఎస్. శ్రీనివాసరావు, కాశీపురం హైస్కూల్ సోసల్ టీచర్ కొట్టాన రాంబాబు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ రైతులకు రాయితీపై ఎరువులు

నాతవరం : ఆయిల్‌పామ్ తోటలు పెంచే రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఉద్యానవనశాఖాధికారి ఎస్.శిరీష అన్నారు. మండలంలో గురువారం పి.కె.గూడెం నాతవరం గ్రామ పంచాయతీల్లో ఆయిల్ పామ్ తోటలు సాగు చేసే రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యానవనశాఖ ద్వారా రాయితీపై ఆయిల్ పామ్ మొక్కలు, ఎరువులు అందిస్తున్నామని, అంతర పంటలు సాగు చేసేందుకు నాలుగేళ్ల పాటు 50 శాతం రాయితీ సదుపాయం కల్పిస్తున్నామని అన్నారు. అదే విధంగా ఆర్‌కేవీవై పథకం ద్వారా జీడి మామిడి, జామ, బొప్పాయి కోకో కొబ్బరి తోటలను కొత్తగా వేసుకునే రైతులకు ప్రభుత్వం రాయితీ సౌకర్యం కల్పిస్తుందన్నారు. తర్వాత జీడిమామిడి తోటలకు బీమా సదుపాయం కల్పిస్తున్నామని, ఈనెల 15తేదీ లోపు బీమా సదుపాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీకే గూడెం సర్పంచ్ లగుడు నాగేశ్వరరావు, పతంజలి కంపెనీ మేనేజరు చంద్రశేఖర్ సచివాలయ వ్యవసాయశాఖ అసిస్టెంటు శివాజీ పాల్గొన్నారు.

ఇంటింటా కుళాయి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించం

- ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ప్రకాష్



కుళాయి పనులు పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ప్రకాష్, ఏఈఈ చంద్రశేఖర్

దేవరాపల్లి : జల్‌జీవన్ మిషన్ పథకంలో చేపడుతున్న ఇంటింటి కుళాయిలు, పైపులైన్ పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని మాడుగుల ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ జి.వి.ఎస్. ప్రకాష్ సూచించారు. ఈ మేరకు దేవరాపల్లి, వాలాబు, ఎ. కొత్తపల్లి గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ స్కీమ్‌లో జరుగుతున్న ఇంటింటా కుళాయి పనులను గురువారం స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ఎస్.చంద్రశేఖర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. మాడుగుల నియోజకవర్గంలో 68036 కుటుంబాలకు ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరందించడమే ధ్యేయంగా రూ. 171 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. ఇప్పటి వరకు 44664 కుటుంబాలకు ఇంటింటి కుళాయి పనులు పూర్తి చేశామన్నారు. మిగిలిన 23372 కుటుంబాలకు ఇంటింటా కుళాయిలు ఏర్పాటు చేసే పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. మంచినీటి ట్యాంక్ నిర్మాణ పనులు సైతం చురుగ్గా జరుగుతున్నాయన్నారు. ఈ పనులు పూర్తయితే నియోజకవర్గంలో 316 గ్రామాలకు ఇంటింటా తాగునీటి సదుపాయం కలుగుతుందన్నారు. వీరి వెంట ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది గంగాధర్, ఇంజినీరింగ్ సిబ్బంది ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



రహదారి భద్రతపై వాకపల్లిలో డ్వాక్రా మహిళలు, వెలుగు సిబ్బంది మానవహారం

దేవరాపల్లి: ట్రాఫిక్ నిబంధనలను పక్కాగా పాటించి ప్రతి ఒక్కరూ వాహనాలు నడపాలని, తద్వారా ప్రమాదాల బారిన పడకుండా సురక్షితంగా గమ్య స్థానాలను చేరుకోవచ్చునని దేవరాపల్లి వెలుగు ఏపీఎం ఎస్. ప్రభాకర్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల రహదారి వాకపల్లి గ్రామంలో రహదారి భద్రతపై వెలుగు ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలతో అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి ట్రాఫిక్ నిబంధనలపై నినాదాలు చేశారు. వేగం వద్దు-ప్రాణం ముద్దు, అతి వేగం ప్రమాదకరం, మద్యం తాగి, సెల్‌ఫోన్లో మాట్లాడుతూ వాహనం నడపరాదని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడం ద్వారా కలిగే అనర్థాలను వివరించారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించడం ద్వారా నిత్యం ఎంతో మంది నిండు ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భుగత రాజేశ్వరి, ఎంపీటీసీ గొరపల్లి భాస్కరరావు, సీసీ గౌరీ శంకర్, వీవోఏలు వరలక్ష్మి, సోనియా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాలు, అంగన్‌వాడీల తనిఖీ

మాడుగుల రూరల్: మండలంలో జాలంపల్లి, ఎల్. పొన్నవోలు, గ్రామ సచివాలయాలను, గొప్పులపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో కొంకి అప్పారావు గురువారం తనిఖీ చేశారు. జాలంపల్లి సచివాలయంలో సిబ్బంది హాజరును పరిశీలించారు. గతంలో గ్రామంలో డయేరియా సోకడం వల్ల మూతపడిన మంచినీటి బోరును తిరిగి ప్రారంభింపజేసి, నీరు పోయే కాలువ పూడిక తీయాలని ఈ మేరకు అంచనాలు వేయాలని వీఆర్పీలను ఆదేశించడం జరిగింది. గొప్పులపాలెంలో అంగన్‌వాడీ కేంద్రం సందర్శించి, హాజరు వివరాలు పరిశీలించారు. అలాగే 2016-17 ఆర్థిక సంవత్సరంలో మంజూరైన ఇళ్లను పరిశీలించారు. పి.ఎం.ఎ.డబ్ల్యు.ఎ.వై. పథంలో 52 పక్కా గృహాలు మంజూరు కాగా, వీటిలో 10 గృహ నిర్మాణాలు పూర్తి చేశారు. మిగిలిన గృహాలు పూర్తి చేస్తే వాటికి బిల్లులు మంజూరు చేస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, హౌసింగ్ ఏఈ డీటీ నాయుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, మాజీ సర్పంచ్ పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

104 సిబ్బందికి జీతాలు చెల్లించండి



కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి నాగదివ్యకు వినతి పత్రం అందజేస్తున్న కింతలి 104 సిబ్బంది

మాడుగుల రూరల్ : ప్రజలకు నిత్యం సేవలు అందిస్తున్న 104 సంచార వాహన సిబ్బందికి మూడు మాసాలుగా జీతాలు ఇవ్వక పోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని కింతలి పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న 104 సిబ్బంది గురువారం స్థానిక వైద్యాధికారి నాగదివ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సంచార వాహనాలు గతంలో మాదిరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని, అరబిందో యాజమాన్యం చెల్లించాల్సిన 3 మాసాలు జీతాలు వెంటనే చెల్లించాలని, 2020 సంవత్సరం తర్వాత విధుల్లో చేరిన డ్రైవరు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, జీవో నెంబరు 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరుతూ కింతలి పీహెచ్‌సీ పరిధిలో 104 సంచార వాహనం డేటా ఎంట్రీ ఆపరేటర్ ముమ్మిన గంగాధర్, డ్రైవరు ఎస్. భార్గవ్‌లు వినతిపత్రం అందజేశారు.

సులభరీతిలో బోధన జరపాలి

బుచ్చెయ్యపేట : విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా బోధన అందించాలని ఉపాధ్యాయులకు డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు సూచించారు. గురువారం దిబ్బిడి జిల్లా పరిషత్ హై స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. పదో తరగతికి వెళ్లి ఉపాధ్యాయులు చెబుతున్న పాఠాలు అర్థమవుతున్నాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది శత శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు.